ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
మంగళవారం | సెప్టెంబరు 22, 2026 | సంపుటి : 7 | సంచిక : 95 | పేజీలు : 2

## రష్యాలో పుతిన్ పార్టీ ఘన విజయం



**జాతీయం, ఆయుధం:**

రష్యా పార్లమెంటరీ ఎన్నికల్లో అధికార యునైటెడ్ రష్యా పార్టీ (యూఆర్‌పీ) ఘన విజయం సాధించింది. 95 శాతం ఓట్లను కౌంట్ చేశామని, ఇందులో యూఆర్‌పీ 57.83 శాతం ఓట్లు సాధించిందని సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. 2021తో పోలిస్తే ఇది 8 శాతం ఎక్కువ కావడం గమనార్హం. అప్పుడు 49.8% శాతం ఓట్లు పుతిన్ కు చెందిన యూఆర్‌పీకి పడ్డాయి. తాజా విజయంతో 450 సీట్లు ఉన్న స్టేట్ డుమా(దిగువ సభ)లో ఆ పార్టీకి 355 సీట్లు దక్కనున్నాయి.

### స్పీకర్‌ను దూషించిన కేసులో తాతా మధు, నవీన్ రెడ్డికి

## హైకోర్టు నోటీసులు




**హైదరాబాద్, ఆయుధం:** స్పీకర్‌ను దూషించిన కేసులో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. గతంలో వీరిద్దరిని అరెస్టు చేయొద్దని నాంపల్లి కోర్టు ఆదేశించింది. దీనిపై పోలీసులు హైకోర్టును ఆశ్రయించారు. నాంపల్లి కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని పోలీసులు పిటిషన్ వేశారు. వీరిద్దరూ కలిసి అసభ్య పదజాలంతో దూషించారని, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌నే ఇద్దరూ దూషించారని పీపీ పేర్కొన్నారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారుల పైనా దాడి చేశారని పీపీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ క్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని తాతా మధు, నవీన్‌రెడ్డికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఓఎస్డీ వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వీరిద్దరిపై ఎస్టీ, ఎస్సీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం ఇద్దరికి వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. ఇరువర్గాల వాదనలను విన్న న్యాయమూర్తి, పోలీసుల రిమాండ్ విజ్ఞప్తిని తోసిపుచ్చారు. నిందితులు ఇద్దరూ చెరో పదివేల చొప్పున పూచీకత్తుతో పాటు రెండేసి ష్యూరిటీలను సమర్పించాలని ఆదేశించింది.



### లింగాల కేదారి కుటుంబానికి

## ప్రభుత్వం అండ

- రూ.10లక్షల ఆర్థిక సాయం అందించాలని అధికారులకు ఆదేశాలు



**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో అంకితభావంతో సేవలందించిన దివంగత లింగాల కేదారి, ఆయన భార్య దివంగత పుష్పలత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో లింగాల కేదారి, పుష్పలత అంకితభావంతో అందించిన సేవలను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. కేదారి దంపతులు ఒక సాధారణ హోటల్ నడుపుతూ, అన్నం పరబ్రహ్మ స్వరూపమని, వృథా చేయకూడదని అవగాహన కల్పిస్తూ, సమాజం పట్ల ఎంతో బాధ్యతగా నడుచుకున్నారు. ఉద్యమ సమయంలో వీరు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీలు అందించారు. హనుమకొండలోని శాంతినగర్, పోస్టల్ కాలనీకి చెందిన లింగాల కేదారి 2026 సెప్టెంబర్ 9న, ఆయన భార్య పుష్పలత 2026 సెప్టెంబర్ 10న విషాదకర సంఘటనలో మృతి చెందారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి CMRF నుంచి సీఎం ఓఎస్డీ రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. మంజూరైన ఆర్థిక సాయాన్ని అర్హులైన చట్టబద్ధ వారసులు, కుటుంబ సభ్యులకు అందించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్‌ను ఆదేశించారు.



## సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను వేగంగా పూర్తి చేయాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియాన ఆదేశాలు

**వరంగల్, ఆయుధం;** వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియాన అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి పనుల పురోగతిని పరిశీలించేందుకు తెలంగాణ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్. చొంగ్తూ సోమవారం హనుమకొండకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆమెకు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాన్ని సందర్శించి జరుగుతున్న నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతి, పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## బాపూజీకి భారతరత్న ఇవ్వాలి

- ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి
- తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి
- సభలో వక్తల ఏకగ్రీవ డిమాండ్
- ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి వేడుకలు



**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ తొలితరం ఉద్యమ రథసారథి, బహుజన ఆశాజ్యోతి, మాజీ మంత్రివర్యులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన నిస్వార్థ సేవలను గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' ప్రకటించాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు డిమాండ్ చేశారు. హన్మకొండ-హంటర్ రోడ్డులోని 'ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్' ప్రాంగణంలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సంస్మరణ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రాంగణంలోని బాపూజీ నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం జరిగిన సభలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వన్నాల శ్రీరాములు మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం, నిజాం నిరంకుశ పాలనపై సాయుధ పోరాటం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, చేనేత రంగానికి చేసిన విశేష సేవలను గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీకి 'భారతరత్న' అవార్డును ప్రదానం చేయాలని కోరారు.అలాగే తెలంగాణ స్వయంపాలన, బహుజన ఆత్మగౌరవం కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడైన బాపూజీని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'తెలంగాణ జాతిపిత'గా ప్రకటించి సముచిత గౌరవం కల్పించాలని వన్నాల డిమాండ్ చేశారు.

ఉమ్మడి వరంగల్ జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు మాట్లాడుతూ..

1969 తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాలలో చురుకుగా పాల్గొని, పదవులను తృణప్రాయంగా త్యజించి, జీవిత చరమాంకంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఎముకలు కొరికే చలిలో సైతం నిరాహార దీక్ష చేసి పోరాడిన బాపూజీ జీవిత చరిత్రను పాఠశాల, కళాశాల పాఠ్యాంశాల్లో చేర్చాలని, తద్వారా భావితరాలకు ఆయన త్యాగాలు, ఆశయాలు తెలియజేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. కమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ మాట్లాడుతూ బాపూజీ చూపిన సామాజిక న్యాయ మార్గం నేటి తరానికి ఆదర్శనీయమని అన్నారు. నిజాం నిరంకుశ పాలనపై పోరాటం మొదలుకొని మలిదశ ఉద్యమం వరకు ఆయన సాగించిన పోరాటం అజరామరమని ఝాన్సీ పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన దార్శనికుడు బాపూజీ అని, ఆయన ఆశయ సాధనలో మహిళలు, యువత భాగస్వాములు కావాలని ఆమె పిలుపు నిచ్చారు. తెలంగాణ ఆన్ లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ఢీంబాయ్ టీవీ న్యూస్ ఛానల్ సీఈవో వేముల సదానందం నేత మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం, నిజాం నిరంకుశ పాలనపై సాయుధ పోరాటం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, చేనేత రంగానికి చేసిన విశేష సేవలను గౌరవిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన గుర్తింపుగా వరంగల్ మామునూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి కొండా లక్ష్మణ్ బాపూజీకి పేరును నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ గౌరవ సలహాదారులు, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యం రాజగోపాల్, పద్మశాలి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వద్నాల నరేందర్, పద్మశాలి సంఘం హన్మకొండ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం నేత, చేనేత కళాకారుల అవార్డు గ్రహీత పిట్ట రాములు, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు తౌటం రవీందర్, పద్మశాలి కుల బాంధవులు, వివిధ బహుజన ప్రజా సంఘాల నాయకులు, మేధావులు పాల్గొన్నారు.



### భూసేకరణకు రూ.6 వేల కోట్ల

## నిధులు విడుదల

- ఇప్పటికే రూ.2,550 కోట్లు విడుదల.. లబ్ధిదారులకు పరిహారం చేరేలా చర్యలు చేపట్టాలి
- నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులను వేగవంతం చేయాలి...
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ఆయుధం:** రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం-పునరావాస పునరుద్ధరణ (ఆర్‌అండ్‌ఆర్) పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులకు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులను బదిలీ చేసి అవసరమైన మేరకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, మరోసారి రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విడుదలైన నిధుల్లో (మిగతా 2లో..)

### సమాజ సేవకుడు కన్నె రాజుకు

## ఉత్తమ సేవా పురస్కారం

**21 ఏళ్లుగా సామాజిక సేవ.. 18,832 మందికి ఉచిత రక్త సాయం**

**వరంగల్, ఆయుధం:**

వరంగల్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఏ.ఆర్. 2009 బ్యాచ్ పోలీస్ కానిస్టేబుల్, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) "రక్తదానంలో ఉత్తమ సేవా పురస్కారం - 2026"ను ఘనంగా అందుకున్నారు. వరంగల్ జిల్లా, ఖానాపురం మండలం, రాగంపేట గ్రామానికి చెందిన కన్నె కుమారస్వామి - రమనీల దంపతుల పెద్ద కుమారుడైన కన్నె రాజు, 21 సంవత్సరాలుగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి నిస్వార్థ సేవలందిస్తున్నారు. భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా, ఆత్మకూర్ మండలంలోని పి.యస్. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వివిధ రంగాలలో ఉత్తమ సేవలు అందించిన రక్తదాతలు, సమాజ సేవకులు, ఉపాధ్యాయులకు ఈ ఉత్తమ సేవా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా కన్నె రాజు గత రెండు దశాబ్దాలుగా రక్తదానం, సామాజిక సేవా రంగాల్లో అందిస్తున్న సేవలను గుర్తించి, నిర్వాహకులు ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

### సేవా విశేషాలు:

కన్నె రాజు ఇప్పటివరకు స్వయంగా 38 సార్లు రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు రక్తదాతల సహకారంతో 18,832 మందికి ఉచితంగా రక్తం అందించడంలో కీలక పాత్ర పోషించారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 86 రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కరోనా (కోవిడ్19) సమయంలో 235 మందితో ప్లాస్మాదానం చేయించారు. దాతల సహకారంతో 430 రోజుల పాటు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.




ఇవేకాకుండా విద్యాభివృద్ధి, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, ఆర్థిక సహాయం, అవయవ దానంపై అవగాహన వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారు. ఈ సేవలన్నింటిని గుర్తించిన భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ అధ్యక్షులు కురుమేటి నవీన్, ప్రధాన కార్యదర్శి హేమంత్ కన్నె రాజును ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ బ్లడ్ డోనర్ డాక్టర్ సంపత్ కుమార్, సామాజిక కార్యకర్త, సర్వ్ నీడ్ ఆర్గనైజర్ డాక్టర్ గౌతమ్ కుమార్, యంగ్ ఇండియా బ్లడ్ డోనర్స్ అధ్యక్షులు జె.బి. బాలు చేతుల మీదుగా కన్నె రాజు ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

ఈ సందర్భంగా కన్నె రాజు మాట్లాడుతూ..

"నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ, నిరంతరం ప్రోత్సహిస్తున్న నా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు, రక్తదాతలకు, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులకు, గురువులకు, రాగంపేట గ్రామ ప్రజలకు, పోలీసు ఉన్నతాధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పురస్కారాన్ని నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ అంకితం చేస్తున్నాను" అని తెలిపారు.

### ఎంజీఎం దుస్థితి..

## ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ధ్వజం**

- వెంటిలేటర్‌పై వరంగల్ అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రి
- ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు కూలి రోగులకు గాయాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన బీజేపీ నేతలు
- ఆరోగ్యశాఖను గాలికొదిలేసిన మంత్రి రాజనర్సింహ వెంటనే రాజీనామా చేయాలి
- కొండా సురేఖ, నాయిని రాజేందర్ రెడ్డిల స్వార్థ రాజకీయాలు

**వరంగల్, ఆయుధం:** ఉత్తర తెలంగాణకే తలమానికమైన, వరంగల్ నగరంలోని అతి పెద్ద ప్రభుత్వ ఆసుపత్రి అయిన ఎంజీఎం ఆసుపత్రి కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం వల్ల వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎంజీఎం ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డులో అకస్మాత్తుగా ఆస్పత్రి పైకప్పు పెచ్చులు ఊడిపడి, చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, బీజేపీ నాయకులు ఎంజీఎం ఆసుపత్రికి చేరగా, ఆసుపత్రి ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకోవాలని చూసిన పోలీసులతో బీజేపీ నాయకులకు మొదటగా తీవ్ర వాగ్వాదం జరిగింది. బీజేపీ శ్రేణులు ప్రమాదం జరిగిన ఆరోగ్యశ్రీ వార్డు




ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం గంట రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్థానిక ప్రజాప్రతినిధులపై నిప్పులు చెరిగారు. "స్థానిక కాంగ్రెస్ మంత్రులకు, ఎమ్మెల్యేలకు కేవలం వారి పదవులపై, కమిషన్లు వసూలు చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై, ప్రజల ప్రాణాలపై అస్సలు లేదు" అని ఘాటుగా విమర్శించారు. నిరుపేద ప్రజలకు అత్యాధునిక ఉచిత వైద్యం అందించాల్సిన ఆరోగ్యశ్రీ వార్డులోనే పైకప్పు కూలి రోగుల ప్రాణాల మీదకు రావడం అధికారుల, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

### ఆసుపత్రే వెంటిలేటర్ పై ఉంది

ప్రజలను రోగాల బారి నుండి కాపాడాల్సిన ఎంజీఎం ఆసుపత్రి, ఈరోజు అధికారుల నిర్లక్ష్యం వల్ల తానే వెంటిలేటర్‌పై ఉన్న దుస్థితికి చేరింది. కనీస మౌలిక వసతులు ఈ ఆసుపత్రిని చూసి వరంగల్ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు అని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. రోగులను కాపాడలేకపోతున్న ఇటువంటి నిర్లక్ష్యపు అధికారులపై మరియు వైద్య శాఖపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎంజీఎం ఆసుపత్రి భవనాల భద్రతపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని, గాయపడిన బాధితులకు ప్రభుత్వం మెరుగైన వైద్యంతో పాటు తగిన నష్టపరిహారం అందించాలని, ఆరోగ్యశాఖను గాలికొదిలేసిన మంత్రి రాజనర్సింహ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై, వైద్య రంగంలో వారి వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గంట రవికుమార్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా కార్యదర్శిలు గోకే వెంకటేష్, వెంకట్ రావు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు టేకుమట్ల రేణుక, కూచన క్రాంతి కుమార్, ఎర్రగొళ్ల భరత్ వీర్, బిజెపి జిల్లా నాయకులు అంకాల జనార్ధన్, బైరి శ్యాం సుందర్, నోముల రతన్, గోగికార్ అనిల్, చిలువేరు రాజేందర్, మాచర్ల దీన్ దయాల్, గుర్రాల చంద్రమౌళి, గడ్డం మహేందర్, కర్నే రవీందర్, మందోటి మహేందర్, షేర్ల అనిల్, కోమాకుల నాగరాజు, మడిపల్లి నాగరాజు, మార్త ఉషారాణి, స్వర్ణజ, శైలశ్రీ, సుజాత, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సీతా నాగరాజు, రజనీష్, శ్రీనివాస్, జెట్లింగ్ శివ, శివ, తదితరులు పాల్గొన్నారు.



## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ ఎన్. రవి

**హనుమకొండ, ఆయుధం:** కుడా పరిధిలో ఉన్న మండలాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కుడా పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతిపై అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా మండలాల వారీగా పెండింగ్ లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత రెవెన్యూ, (మిగతా 2లో..)



# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

**వరంగల్, ఆయుధం:** ఆచార్య స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం, తెలంగాణ పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేవులపల్లి సాయిరాజ్, టీపీయూఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు కొడం రవి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, కుసుమ సత్యనారాయణ, బొద్దున వెంకటేశ్వర్లు, కొండబత్తుల రాజమౌళి, కొండా శ్రీనివాస్, కోదూరి రమేష్, TPRUS జిల్లా కార్యదర్శి గుండు కామేశ్వర రావు, మార్గం కుమారస్వామి, రాపెల్లి బాలరాజు, గుర్రపు సుధాకర్ రావు, పడాల సోమయ్య, చిన్నమి రాజన్ బాబు, కొండాబత్తుల రాజేందర్, వడ్నాల నాగేష్, వంగరి కోటేశ్వర రావు, ములక సాంబయ్య, కుసుమ శ్యాంసుందర్, వివిధ ప్రజాసంఘాల నాయకులు, ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.



# ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** ప్రజావాణి అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజావాణి అర్జీలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి స్వీకరించారు. ప్రజల నుండి అందిన ప్రజావాణి అర్జీలను సంబంధిత శాఖల అధికారులను పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అక్కడికక్కడే ఆదేశించారు. అదేవిధంగా వర్చువల్ విధానంలో ఆర్డీఓ, తహసిల్దార్, ఎంపీడీవోలతో ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ మాట్లాడారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా, రెవెన్యూ డివిజనల్, మండల స్థాయి లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 298 అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలనుండి అందిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రజలు అందించిన అర్జీలు పెండింగ్ లో ఉండకుండా పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డిఆర్డీవో మేన శీను, సీపీవో సత్యనారాయణ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నిత్యావసరాల ధరలను నియంత్రించాలి

- రేషన్ షాపులో 13 రకాల వస్తువులు అందించాలి
- ఏఐఎఫ్ డిడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగాల రాగసుధ



**హనుమకొండ, ఆయుధం:** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య(ఏఐఎఫ్ డిడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వంగాల రాగసుధ మాట్లాడుతూ.... నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతూ సామాన్య ప్రజల జీవితాలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టి వేస్తున్నాయి. బియ్యం, పప్పు, వంట నూనెలు, కూరగాయలు, పాలు, గుడ్లు ఇతర నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో కుటుంబాల నెలవారి ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ ధరల పెరుగుదల ప్రభావాన్ని మొట్టమొదటిగా అత్యంత తీవ్రంగా ఎదుర్కొంటున్నది మహిళలే ఇంటి బడ్జెట్ ను నిర్వహించే బాధ్యత ఎక్కువగా మహిళపై ఉండటంతో ధరల పెరిగిన ప్రతిసారి తమ కుటుంబాల అవసరాలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పిల్లల పోషకాహారం, విద్య, ఆరోగ్యం దుస్తులు వంటి అవసరాలపైన ఖర్చులను తగ్గించుకోవాల్సి వస్తుందన్నారు. తక్షణమే నిత్యవసర వస్తువులు రేషన్ షాప్ ద్వారా ప్రజలకు 13 రకాల వస్తువులు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేనియెడల అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సంధ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నబోయిన ప్రేమలత, ప్రత్యూష, జిల్లా కమిటీ సభ్యులు ఏన్ రెడ్డి రాజేంద్ర, గడ్డం సుధారాణి, అరుణ, లక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

### పోటీ పరీక్షల్లో సిలబస్ మార్పు అంశంపై

# టీజీపీఎస్సీ కీలక ప్రకటన




**హైదరాబాద్, ఆయుధం:** ఉద్యోగ నియామక పోటీ పరీక్షలకు సంబంధించి టీజీపీఎస్సీ కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షల సిలబస్‌లో మార్పుపై వస్తున్న ఊహాగానాలపై స్పందించింది. తాము ఎలాంటి సిలబస్ కమిటీని ఏర్పాటు చేయలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. సిలబస్ మార్పు ప్రచారంతో ఆందోళన చెందుతున్న అభ్యర్థుల నుంచి వచ్చిన వినతులు, సందేహాలపై స్పందించిన కమిషన్.. పోటీ పరీక్షల సిలబస్‌లో పెద్దగా ఏవైనా మార్పులు ప్రతిపాదిస్తే ఏడాది ముందే తెలియజేస్తామని పేర్కొంది. ఒకవేళ సిలబస్‌లో స్వల్ప మార్పులు ఉన్నా గానీ.. ఆ వివరాలను సంబంధిత నియామక ప్రకటనతో పాటే జారీ చేస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి తెలిపారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం స్ఫూర్తిదాయకం

- ఓబీసీ ఆధ్వర్యంలో లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి
- నివాళులర్పించిన ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గడ్డం భాస్కర్



**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని హనుమకొండ రాంనగర్ లోని బీసీ భవన్ లో ఓబీసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీసీ నేతలు, వివిధ కులసంఘాల ప్రతినిధులతో కలిసి ఓబీసీ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ ఎస్. సుందర్ రాజ్ యాదవ్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు...బడుగు, బలహీన వర్గాలు, చేనేత కార్మికుల సంక్షేమం కోసం బాపూజీ చేసిన కృషిని ఓబిసి చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ గుర్తుచేశారు. ప్రజా ప్రయోజనాల కోసం పదవులను సైతం త్యాగం చేసిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు, స్వాతంత్ర్య సమరయోధుడని, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. ఓబీసీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చూపిన నిబద్ధత, ధైర్యం, త్యాగం, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. మలిదశ ఉద్యమంలో తన నివాసాన్ని తెలంగాణ ఉద్యమం కోసం కేటాయించారన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన సేవలను భావితరాలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, బీసీ నాయకులు సంగం వేణుమాధవ్ గౌడ్, గాజుల సంపత్, చక్రపాణి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

### కొండా లక్ష్మణ్ స్ఫూర్తితో..

# చేనేత పరిరక్షణకు పోరాడాలి

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టి.వెంకట్రాములు



**వరంగల్, ఆయుధం:** చేనేత ముద్దుబిడ్డ, ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అందించిన పోరాట స్ఫూర్తితో చేనేత పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారానికి అకుంఠిత దీక్షతో పోరాడాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. 14వ వర్ధంతి సందర్భంగా వరంగల్ కొత్తవాడలో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు ప్రసంగిస్తూ నిజాం రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా, బడుగు బలహీన వర్గాల విముక్తి కోసం లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. స్వాతంత్ర అనంతరం చేనేత కార్మికుల హక్కుల కోసం, సహకార వ్యవస్థ నిర్మాణం కోసం వారు చేసిన కృషి ఎనలేనిది అన్నారు. చేనేత, గీత, మత్స్య, రజక, నాయీబ్రాహ్మణ, యాదవ, ముదిరాజ్, కమ్మరి, కుమ్మరి, యాదవ తదితర బీసీ కులాల, చేతివృత్తుల, సంక్షేమం కోసం అభ్యున్నతి కోసం వారు చేసిన సేవలు మరువలేనివన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం లక్ష్మణ్ బాపూజీ మంత్రి పదవికి రాజీనామ చేసిన త్యాగమూర్తి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వారు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. వృద్ధాప్యంలో ఢిల్లీకి వెళ్లి రాష్ట్ర సాధన కోసం రాష్ట్ర సాధన కోసం నిరాహార దీక్ష చేసిన విషయాన్ని గుర్తు చేశారు. చివరి శ్వాస వదిలేవరకు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తపించాడన్నారు. అశేష త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 14 ఏళ్ళు గడిచిన నేటికి చేనేత బీసీ బడుగు బలహీన వర్గాల పరిస్థితి దారుణంగానే ఉందన్నారు. భౌగోళిక తెలంగాణ వచ్చిందే తప్ప ప్రజల జీవితాలలో మార్పు రాలేదన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ బడుగు బలహీనవర్గాల చైతన్యంతో సంఘటితమై రాజకీయాల కతీతంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. నిస్వార్థ ప్రజా నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశించిన, కలలుగన్న సామాజిక తెలంగాణ సాధన కోసం పోరాడటమే వారికి నిజమైన నివాళులు అర్పించినట్టు కాగలదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగబత్తిని యాదగిరి, సామల రమేష్, ఎల్.రామకృష్ణ, టీ.నర్సయ్య, చందా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడపవద్దు

- సురక్షితంగా ప్రయాణించండి, ప్రాణాలను కాపాడుకోండి
- ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ



**వరంగల్, ఆయుధం:** రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించడం మరియు మద్యం సేవించి వాహనాలు నడపకుండా ప్రజలను చైతన్యపరచడం కోసం హన్మకొండ పోలీస్ హెడ్ క్వార్టర్ లో నెలకొల్పబడిన ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారయణ డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన సుమారు 150 మంది వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే ప్రమాదాలు, ప్రాణనష్టం, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించిన అనంతరం వాహనం నడపకుండా, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల డ్రైవర్‌తో పాటు ఇతర వాహనదారులు, ప్రయాణికులు, పాదచారుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని, మైనర్ లను వాహనాలు నడుపుటకు అనుమతించవద్దని, ఒకవేళ మైనర్ లు వాహనం నడిపి పోలీసులకు పట్టుబడినట్లైతే వాహన యజమానులపై చట్టపరమైన చర్యలుంటాయని, "మద్యం సేవించి వాహనం నడపవద్దు - సురక్షితంగా ప్రయాణించండి, ప్రాణాలను కాపాడుకోండి" అని వాహనదారులకు ఏసీపీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమమలో ఆర్ఎస్సై నవీన్ కుమార్, ఎస్సై వేణుగోపాల్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ అరుణ, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన వారు పాల్గొన్నారు.

### బాలాజీనగర్‌లో ఒకేసారి

# ఆరుగురికి ఎంబీబీఎస్ సీట్లు

- ఆలయ కమిటీ, పోలీసులు, ప్రజాప్రతినిధుల ఘన సత్కారం



**వరంగల్, ఆయుధం:** గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఏనుమాముల బాలాజీ నగర్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి ఆరుగురు విద్యార్థులు నీట్ లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్ సీట్లు కైవసం చేసుకున్నారు. బాలాజీ నగర్ కాలనీకి చెందిన ముగ్గురు పూర్వ విద్యార్థులు, బేడ బుడగ జంగాల కాలనీకి చెందిన మరో ముగ్గురు విద్యార్థులు ఈ ఘనత సాధించారు. పేదరికాన్ని జయించి, కష్టపడి చదివి డాక్టర్ సీట్లు సాధించిన వీరి పట్టుదలకు గ్రామమంతా హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ సందర్భంగా శ్రీ కైలాస ఈశ్వర, ఆంజనేయస్వామి, పోచమ్మదేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో ఘన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఎనుమాముల సీఐ జవ్వాజి సురేష్, 14వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సులోచన సారయ్య, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు విద్యార్థులను శాలువాలు, పూలమాలలు, బొకేలతో సత్కరించి ఆశీర్వదించారు. "మన ఊరి బిడ్డలు రేపు గొప్ప డాక్టర్లుగా ఎదిగి పేద ప్రజలకు సేవ చేయాలి, మన వరంగల్ ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటాలి" అని పెద్దలు ఆకాంక్షించారు. విద్యకు పెద్దపీట వేసే మన గ్రామ యువతకు ఈ విజయం స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

### భూసేకరణకు రూ.6 వేల కోట్ల

# నిధులు విడుదల

(మొదటి పేజీ తరువాయి..)
అధిక భాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి, లబ్ధిదారులకు చేరకపోవడం ఆందోళనకరమని అన్నారు. జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. నిధులు సరిపోకపోయినా, ఇతర కారణాల వల్ల చెల్లింపులు సాధ్యం కాకపోయినా ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. విడుదలైన నిధులను అధికారుల వద్ద ఉంచి పనులను పెండింగ్‌లో పెట్టవద్దని స్పష్టం చేశారు.

భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ నిబంధనల ప్రకారం జరగాలని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పరిహారం మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అవార్డు జారీ చేసిన తరువాత కూడా చాలా కాలం పరిహారం అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అధిక పరిహారం కోసం డిమాండ్లు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవో వెంకటేశ్వర్లు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# అవార్డు గ్రహీత కు సన్మానం

**వరంగల్, ఆయుధం:** వరంగల్ జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మహమ్మద్ మహబూబ్ పాషా ఉరుసు ప్రాంతానికి చెందిన చిన్ననాటి స్నేహితులు శాలువాతో సన్మానం చేసి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అవార్డు గ్రహీత మహబూబ్ జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ కొంగపాక పాఠశాలలో పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అర్బన్ కాంగ్రెస్ నాయకుడు గడ్డం యుగంధర్ గౌడ్, ఆడపు అనిల్ కుమార్, మహమ్మద్ నబీ, రిటైర్డ్ ఆర్మీ వనపర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# రుద్రమ నగరంలో కూచిపూడి నృత్యాలు

**వరంగల్, ఆయుధం:** రంగసాయిపేటలోని రుద్రమ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో సోమవారం ఎన్.సి.ఎన్ కళాక్షేత్రం బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాట్య గురువు కొనతం వెంకటేశ్వర్లు, విద్యార్థులు సాన్వి, లక్ష్మి, స్నిగ్ధ, హసిని, రామ భవిశ్య, చైత్ర, కాత్యాయాని, సన్మహి, శ్రీసంహిత, శ్రీనిధి, దివ్య, సంయుక్త, ఉత్సవ కమిటీ అధ్యక్షులు హనుమంతరావు, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, సుదర్శన్, వెంకన్న, కృష్ణ, దేవేందర్, మహేందర్, రాజేష్, సతీష్, పూర్ణచందర్, దిలీప్ కుమార్, సుతేజ్, సిద్ధార్థ, కుశాల్, రాజ్ కుమార్, బోగోజు రాజేష్ పాల్గొన్నారు.

### ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

# వేగంగా పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి..)
ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. దరఖాస్తుదారులు పోర్టల్ లో అప్ లోడ్ చేసిన పత్రాలు, క్షేత్రస్థాయిలో అధికారులు స్థల పరిశీలన చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కర చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కుడా సీపీవో అజిత్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### బీసీల ఆరాధ్యుడు

# కొండా లక్ష్మణ్ బాపూజీ



**వరంగల్, ఆయుధం:** కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా సోమవారం బిజెపి ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో వరంగల్ కొత్తవాడ జంక్షన్ వద్ద గల కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బిజెపి రాష్ట్ర నాయకులు కుసుమ సతీష్ హాజరై వారి విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం మాట్లాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ మూడు తరాల ఉద్యమ స్ఫూర్తి ప్రదాత అని, అలాగే వారు తెలంగాణ సాధించడం కొరకు తన మంత్రి పదవిని కూడా త్యాగం చేశారని కొనియాడారు. ఇంటిని కూడా నిస్వార్థంగా జల దృశ్యాన్ని తెలంగాణ కొరకు ఇచ్చినటువంటి నిస్వార్థ నాయకుడని, బీసీల హక్కుల కోసం పోరాడినటువంటి బీసీల ఆరాధ్య దైవమని, అలాంటి గొప్ప మహనీయుడు ఆశయాలను మనం ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బైరి మురళీకృష్ణ, ముంద్రాతి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు బైరి శ్యాంసుందర్, మాచర్ల దీన్ దయాల్, చిలువేరు రాజేందర్, గాజుల సంపత్, కోమాకుల నాగరాజు, గుర్రపు సత్యనారాయణ, కోట సతీష్, కొంతం సంగీత్, సామల నిరంజన్, బొద్దు రాకేష్, అల్లి అజయ్, కందగట్ల మల్లికార్జున్, శ్రీధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695